## సమతుల్య వ్యవసాయంపై ఉద్యాన రైతులకు శిక్షణ



శిక్షణలో పాల్గొన్నఅధికారులు, రైతులు

**ఏజీవర్సిటీ:** ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయంలో 'సమత్యుల వ్యవసాయంలో సాంకేతికత' అనే అంశంపై ఉద్యాన రైతులకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో వారం పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమానికి పాలేం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం సహ సంచాలకుడు డాక్టర్ ఎం మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో సమతుల్య వ్యవసాయం ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. నీటి సాంకేతిక పరిజ్ఞాన సంచాలకులు వారం పాటు ఉద్యాన పంటలైన కూరగాయలు, పూల తోటల పెంపకంలో ఆధునిక పరిజ్ఞాన వినియోగం, అలాగే పంటల ఎగుమతి అవకాశాలను కూడా రైతులకు వివరించనున్నారు. నేషనల్ కమిటీ ఆన్ ప్రెసిసన్ అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ ఈ కార్యక్రమానికి సహకారం అందించింది. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు ప్రేమ్‌సింగ్, అనిల్ కుమార్ వివిధ జిల్లా యువ రైతులు పాల్గొన్నారు.

## శిశుమందిరంలో ఆచార్యుల శిక్షణ కార్యక్రమం షురూ



మాట్లాడుతున్న విద్యాభారతీ దక్షిణ మధ్యక్షేత్ర కార్యదర్శి ఆయాచితుల లక్ష్మణరావు



కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్యులు

**బండ్లగూడ:** బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ శారదాధామం శిశు మందిరంలో ఆచార్యుల శిక్షణ కార్యక్రమాన్ని విద్యాభారతీ దక్షిణ మధ్యక్షేత్ర కార్యదర్శి ఆయాచితుల లక్ష్మణరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగం ఎంత బలోపేతంగా ఉంటే సమాజం అంత త్వరగా అభివృద్ధి చెందుతుందన్నారు. శిశు మందిరాల్లోని ఉపాధ్యాయులను ఆచార్యులు అని పిలుస్తుంటారని వారికి బోధనా విషయాలతో పాటు సమగ్ర వికాసం కలిగేలా యోగా, కళాత్మక అంశాలు, వ్యాయామ విద్య అన్ని జోడిస్తూ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ శిక్షణతో రాబోయే తరం జీవన విలువలు, దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం కనుగొనే రీతీలో విద్యార్థులను తయారు చేయాలని అప్పుడే సమాజం మరింత శక్తివంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో శ్రీ సరస్వతీ విద్యా పీఠం ప్రాంత కార్యదర్శి ముక్కాల సీతారాములు, ప్రముఖ సామాజిక కార్యకర్త డాక్టర్ నీలిమా, సరస్వతీ విద్యాపీఠం తెలంగాణ అకాడమీ ఇన్‌చార్జి కృష్ణమాచార్యులు, 250 మందిపైగా ఆచార్యులు శిక్షణలో పాల్గొన్నారు.

## ప్రమాదాలను తమ దృష్టికి తీసుకురావాలి



ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్న రెస్క్యూ టీం

**మైలార్‌దేవ్‌పల్లి:** ప్రమాదాలు జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ రెస్క్యూ టీం ఇన్‌చార్జి సత్యనారాయణ సూచించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఉడంగడ్డ జీహెచ్ఎంసీ గ్రౌండ్‌లో నవయువయుత్ క్లబ్ సభ్యులు, యువకులకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షం వచ్చినప్పుడు, గాలి దుమారంతో చెట్లు విరిగినప్పుడు, ఇంట్లో మంటలు చెలరేగినప్పుడు, వెంటనే 100 నంబర్‌కు కాల్ చేయాలన్నారు. వెంటనే తమ బృందం అక్కడి చేరుకుని నివారణ చర్యలు చేపడుతుందని చెప్పారు. ఆపదలో ఉన్న వారిని కాపాడడం బాధ్యతగా భావించాలని యువతను కోరారు. కార్యక్రమంలో నవ యువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేశ్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## పోటీతత్వం పెంపొందించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న వనితావాసుదేవ్

ఐఐటీ ఢిల్లీ ప్రతినిధి వనితావాసుదేవ్

**మణికొండ:** యువత సృజనాత్మకతతో పాటు ఆవిష్కరణల్లో పోటీతత్వం పెంపొందించుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని ఐఐటీ ఢిల్లీ టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ప్రతినిధి వనితా వాసుదేవ్ అన్నారు. గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలతో సంయుక్తంగా నిర్వహించిన వాతావరణం, సుస్థిరత నేపథ్యంగా జరిగిన సాల్వ్ ఫర్ టుమారో సెన్సిటైజేషన్ సెషన్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె శాంసంగ్ ఇండియా విద్యార్థుల్లోని ఆవిష్కరణ స్ఫూర్తిని వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి. చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఇంక్యుబేషన్‌లోని అవకాశాలను ఒడిసిపట్టుకుని వివిధ పారిశ్రామిక ప్రముఖుల సలహాలు, సూచనలను అనుగుణంగా పనిచేయాలన్నారు. రంజిత్‌సింగ్, ముస్కాన్, డాక్టర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ మాధవి, డాక్టర్ ప్రవీణతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓవర్ టూ గోవా..!

- నార్సింగి మున్సిపాలిటీలో వేడెక్కిన రాజకీయం
- గోవా బాట పట్టిన పలువురు కౌన్సిలర్లు
- ఈ నెల 18న అవిశ్వాస సమావేశం
- నేరుగా మీటింగ్‌కు వచ్చేలా ప్రణాళికలు



నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయం

**మణికొండ:** లోక్‌సభ ఎన్నికలు ప్రక్రియ పూర్తి కాగానే నార్సింగి మున్సిపాలిటీ రాజకీయం మరింత వేడెక్కింది. మున్సిపాలిటీకి చెందిన 12 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్ రేఖాయాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ ఇటీవలే జిల్లా కలెక్టర్‌కు లేఖను అందించారు. దాంతో కలెక్టర్ ఈనెల 18వ తేదీన ప్రత్యేక సమావేశం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అయితే సమయం దగ్గర పడడం, ఎక్కడ తమపై ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, అతని వర్గీయుల నుంచి ఒత్తిడి వస్తుందనే కారణంతో 9 మంది కౌన్సిలర్లు గోవాకు పయనమయ్యారు. ఈనెల 18వ తేదీన ఉదయం 11గంటలకు నేరుగా నార్సింగికి వచ్చేలా పణాళికను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం.

### గండిపేట అవిశ్వాసాలు కేరాఫ్ గోవా..

గండిపేట మండల పరిధిలోని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాసం పెట్టి ఏకంగా నెల రోజుల పాటు గోవాలోనే ఉన్నారు. అలాగే మణికొండ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లలో కొందరితో పాటు చైర్మన్‌కు అండగా నిలిచిన కౌన్సిలర్లు సైతం గోవా కేంద్రంగానే క్యాంప్ రాజకీయాలు నిర్వహించారు. బండ్లగూడలో మేయర్ పీఠం దిగిపోగా మణికొండలో చైర్మన్ మాత్రం తన పదవిని నిలుపుకున్నారు. రెండు మున్సిపాలిటీల్లో అవిశ్వాస తంతు ముగియగానే ఇపుడు నార్సింగి కేంద్రంగా మొదలయ్యింది. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లకు వ్యతిరేకంగా అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్లలో ఇప్పటికే 9 మంది గోవా బాట పట్టగా, మరో ముగ్గురు గురువారం వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు సమాచారం. దాంతో గండిపేట మండల పరిధిలోని మూడు మున్సిపాలిటీల అవిశ్వాస రాజకీయాలు గోవా కేంద్రంగా జరుగుతుండడంతో స్థానికులు చత తర్జించుకుంటున్నారు.

## లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పరిశోధన పత్రం సమర్పణ



**రాయదుర్గం:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థిని శిల్పా రాజీవన్ లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్‌లో పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లోని సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీలో డాక్టర్ రాణి రత్నప్రభ పర్యవేక్షణలో శిల్పారాజీవన్ పీహెచ్‌డీ చేస్తున్నారు. ఆమె 'మహిళలు పర్యావరణ సంరక్షకులు' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ పొలిటికల్ సైన్స్ (ఎల్ఎస్ఈ) ఇంటర్నేషనల్ అసమానత కేంద్రం నిర్వహించిన 'వాతావరణ మార్పు, అసమానత'పై వర్క్‌షాప్‌లో కేరళలోని హరిత కర్మసేన(హెచ్‌కేఎస్) ద్వారా జెండర్ పాత్రల పరివర్తన' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు.

## సెల్‌పోన్లు లాక్కెళ్లే దొంగ అరెస్టు



**నాంపల్లి:** రైలు ప్రయాణికుల చేతిలోని సెల్ ఫోన్లను లాక్కెళ్లే ఓ నేరస్తుడిని నాంపల్లి జీఆర్పీ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుండి రూ.88 వేల విలువైన మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మాదన్నపేట, రెయిన్‌బజార్ అర్సత్ కాలనీకి చెందిన మహ్మద్ నబీర్ కుమారుడు మహ్మద్ ఖాదర్ అలియాస్ ఖదీర్ అలియాస్ అబ్దుల్(27) వృత్తిరీత్యా టైల్స్ కార్మికుడు. జల్సాలకు అలవాటుపడ్డ కార్మికుడు అబ్దుల్ దొంగతనాలు చేయడానికి అలవాటుపడ్డారు. ఈ క్రమంలో నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ఈ నెల 11న ప్లాట్‌ఫారం నెంబరు–1 మీద తన బంధువులకు వీడ్కోలు పలికేందుకు వచ్చిన ఇంద్రజిత్ చేతులోని సెల్‌ఫోన్‌ను లాక్కెళ్లి పారిపోయాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో సీసీ కెమెరాల ఆధారంగా నేరం చేసిన అబ్దుల్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన తప్పును ఒప్పుకున్నారు. అంతేకాకుండా అతడి దగ్గర ఉన్న మూడు సెల్‌పోన్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## తాగునీరు కలుషితం..!

పట్టించుకోని అధికారులు



ప్రభుత్వ పాఠశాల ఎదుట వాల్వ్ వద్ద లీకేజీ అవుతున్న నీరు

**మణికొండ:** మణికొండ మున్సిపాలిటీలోని ప్రభుత్వన్నత పాఠశాల వద్ద తాగునీరు కలుషితం అవుతున్నది. అక్కడి వాల్వ్ వద్ద లీకేజీ ఏర్పడడంతో నీరు గుంతలోనే ఉంటున్నది. నీటి సరఫరా నిలిచిన తర్వాత అదే మురుగునీరు తిరిగి పైపుల్లోకి వెళ్లి కలుషితమై మురుగునీరుగా సరఫరా అవుతుందని మణికొండ గార్డన్, సెక్రటేరియట్ కాలనీ, కేపీఆర్ కాలనీ, మణికొండ గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా జల మండలి అధికారులు స్పందించి వెంటనే లీకేజీని అరికట్టి శుద్ధ జలాన్ని సరఫరా చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

## వైద్య విభాగంలో నర్సుల పాత్ర కీలకం



నర్సును సన్మానిస్తున్న డాక్టర్ మధుసూదన్‌రెడ్డి తదితరులు

రంగారెడ్డి జిల్లా ఆస్పత్రి డాక్టర్ మధుసూదన్‌రెడ్డి

**శేరిలింగంపల్లి:** వైద్య విభాగంలో నర్సుల పాత్ర కీలకమని రంగారెడ్డి జిల్లా ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం శేరిలింగంపల్లిలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫ్లొరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా డాక్టర్ మధుసూదన్‌రెడ్డి ఆమె చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నర్సులు సేవామూర్తులన్నారు .రోగులకు వైద్యులు ఇచ్చే మందులు ఎంత ముఖ్యమో, నర్సుల సేవలు కూడా అంతే ముఖ్యం అన్నారు. నర్సింగ్ విభాగంలో ఉత్తమ సేవలు అందించిన బీహెచ్ఈఎల్, నిమ్స్, గచ్చిబౌలి టిమ్స్, కొండాపూర్‌లోని జిల్లా హాస్పిటల్, శేరిలింగంపల్లి, హఫీజ్‌పేట్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్, ఈఎస్ఐ రామచంద్రాపురం, ఉర్దూ యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ హెల్త్ సెంటర్స్, పటాన్‌చెరు ఏరియా హాస్పిటల్ తదితర ప్రాంతాల్లో పని చేసిన 80 మంది నర్సులను సన్మానించారు. అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విజయలక్ష్మి, వాణీ సాంబశివరావు, జనార్దన్, పాలం శ్రీను, ధర్మసాగర్, వెంకటేశ్వర్లు, బాలన్న, సంతోషి,లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**మైలార్‌దేవ్‌పల్లి:** వివిధ మరమ్మతుల కారణంగా గగన్‌పహాడ్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 16న (నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గగన్‌పహాడ్ అసిస్టెంట్ ఇంజినీర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం తమిల్‌నాడు హోటల్ , డైమండ్ వే బ్రిడ్జ్ , బుద్వేల్ రైల్వేస్టేషన్ , పరివార్ దాబా, ఆర్ఈసీ, ఆరాంఘర్, సాతంరాయి ఫీడర్‌లోని పాశం బండ, ఆర్‌జీకే, సుచిర్ ఇండియా, పాశంబండ ఏజీఎల్, మంజీర కండక్టర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

**పలు ఫీడర్లలో..**

**మణికొండ:** మైనర్ మెయింటెనెన్స్, కొత్త విద్యుత్ కనెక్షన్ పనుల నేపథ్యంలో ఈ నెల 16న (నేడు) పలు ఫీడర్లలో అరగంట పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నార్సింగి ఏఈ సందీప్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచి 7గంటల వరకు నియోపోలీస్, శాంతినగర్, సబితానగర్, ఫ్రంట్‌లైన్ సెవెన్, ఫైజోన్, ట్రెజర్‌ఐలాండ్, మూవీటవర్ ,మై హోం తక్షయ, ఎన్‌సీసీ అర్బన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు. అలాగే ఉదయం 7.30 నుంచి 8 గంటల వరకు బాబు జగ్జీవన్‌రాం కమ్యూనిటీహాల్ , నార్సింగి ఆరో వార్డు, సాయిబాబా ఆలయం ఏరియా, ముప్పారోడ్, గిరిగిరి గడ్డ, వాసవీ అట్లాంటిస్ ప్రాంతాలు, ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు వివేకానందనగర్, నార్సింగి హైట్స్, క్యూబా మజీద్‌కాలనీ, సజ్జన్‌సింగ్ లేఅవుట్, మార్వాటౌన్‌షిప్, ఖాస్పాకాలనీ, అలకాపూర్ రోడ్ నంబర్ 29,30లలో, ఉదయం 8.30 నుంచి 9 గంటల వరకు మూవీటవర్స్, అపర్ణ ఆర్ఎంసీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## మనూలో ఎంఏ ఉమెన్స్ స్టడీస్‌లో ప్రవేశాలు

దరఖాస్తుకు జూన్ 30 ఆఖరు

**రాయదుర్గం:** మనూలోని ఉమెన్స్ స్టడీస్ సబ్జెక్టు విద్యార్థులకు కెరీర్ అవకాశాలు మెండుగా ఉంటాయని 'మనూ' డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఉమెన్ ఎడ్యుకేషన్(డీడబ్ల్యూఈ) హెడ్ ప్రొఫెసర్ అమీనా తహసీన్ బుధవారం తెలిపారు. ఎంఏ విమెన్స్ స్టడీస్‌లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ జూన్ 30 అని ఆమె పేర్కొన్నారు. ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ లేదా తత్సమాన మదర్సా కోర్సులు ఉన్న విద్యార్థులు మెరిట్ ప్రాతిపదికన ఎంఏ ఉమెన్ స్టడీస్‌లో ప్రవేశం పొందేందుకు అర్హులని ఆమె వివరించారు. ఆన్‌లైన్ దరఖాస్తు, ప్రాస్పెక్టస్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు గది నెంబర్ 101 మహిళా విద్యాశాఖ, లెక్చర్ హాల్ కాంప్లెక్స్ మనూ క్యాంపస్‌ను సందర్శించాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 9392303545, 9985740884లో సంప్రదించాలని సూచించారు.

## సీబీఎస్ఈలో 'మనూ మోడల్ స్కూల్' వందశాతం ఉత్తీర్ణత

**రాయదుర్గం:** సీబీఎస్ఈ ప్రకటించిన ఫలితాల్లో మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని మోడల్ స్కూల్‌లోని పదవ తరగతి, 12వ తరగతి విద్యార్థులు సత్తా చాటారు. పదోతరగతిలో 47 మంది విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ కఫీల్ అహ్మద్ బుధవారం తెలిపారు. 47 మందిలో 13 మంది విద్యార్థులు 100 శాతం మార్కులు సాధించారు. అదేవిధంగా 12వ తరగతిలో మొత్తం 31 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారిలో 30 మంది ఉత్తీర్ణులయ్యారని ఒకరికి కంపార్ట్‌మెంట్ లభించింది.కాగా వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ మంచి ఫలితాలు సాధించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి యేటా 100 శాతం ఫలితాలు వచ్చేలా చూడాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారు అభినందించారు.

## రాజ్‌పాల్ రెడ్డి జన్మదిన వేడుకలు



**రాజేంద్రనగర్:** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాజ్‌పాల్ రెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీతో పాటు ఇతర నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దేవేందర్ రాజు, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# 24న బండ్లగూడ మేయర్ ఎన్నిక..?



బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

- ముహూర్తం ఖరారు చేసినట్లు సమాచారం
- కార్పొరేషన్ రెండో మేయర్‌గా మిద్దెల లతాప్రేమ్‌గౌడ్..?



**బండ్లగూడ:** బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ఎన్నికకు సమయం ఆసన్నమైనట్లే కనిపిస్తోంది. ఈ మేరకు ఎన్నికల కమిషనర్ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. దీంతో ఈ నెల 24వ తేదీన ముహుర్తాం ఖరారు చేసినట్లు సమాచారం. గతంలో కార్పొరేషన్ మేయర్‌గా ఉన్న బుర్ర మహేందర్‌గౌడ్‌పై కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి పదవి నుంచి తప్పించిన విషయం తెలిసిందే.

### ఒంటెద్దు పోకడలతోనే..

మొదటి మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ ఉన్న సమయంలో ఆయన చేసిన ఒంటెద్దుపోకడలు నచ్చక 16 మంది కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి జిల్లా కలెక్టర్‌కు లేఖను అందించారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర మార్చి 21వ తేదీన బలనిరూపణ చేపట్టగా అవిశ్వాసం నెగ్గినా కార్పొరేటర్లు మేయర్‌ను గద్దెదించారు.

### కార్పొరేషన్ రెండో మేయర్‌గా మిద్దెల లతాప్రేమ్‌గౌడ్..?

కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్‌ను గద్దెదించడంతో ఆ స్థానం ఖాళీగా మారింది. దీంతో ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు కలెక్టర్ మేయర్ పీఠం కోసం ఈ నెల 24వ తేదీన ఎన్నుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు మిద్దెల లతాప్రేమ్‌గౌడ్ చురుగ్గా ఉండి కార్పొరేటర్లను కలుపుకొని ముందుకు సాగడంతో మిగితా వారంతా ఆమెకే మొగ్గు చూపే అవకాశం కనిపిస్తోంది. అంతా సజావుగా జరిగేతే ఈ నెల 24వ తేదీన రెండో మేయర్‌గా లతాప్రేమ్‌గౌడ్ పీఠం దక్కించుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

### మాజీ మేయర్ ఆగడాలను బయటకు తీస్తాం : మిద్దెల లతాప్రేమ్‌గౌడ్

మహేందర్‌గౌడ్ మేయర్‌గా ఉన్న సమయంలో అనేక అక్రమాలకు పాల్పడ్డాడని కార్పొరేటర్ మిద్దెల లతాప్రేమ్‌గౌడ్ ఆరోపిస్తున్నారు. ఆదర్శనగర్ కాలనీలో 100 గజాల స్థలంలో కమ్యూనిటీహాల్ గ్రౌండ్ ఫ్లోర్‌లో కేవలం గోడల నిర్మాణానికే రూ. 40 లక్షల నిధులు ఖర్చయ్యాయని లెక్కలు చూపి గతేడాది అక్టోబర్ 9న శిలాఫలకాన్ని ఆయన చేతుల మీదుగా ప్రారంభించారన్నారు. కేవలం రూ. 2–3 లక్షల వ్యయంతో అయ్యే పనికి రూ.40 లక్షలు ఎలా ఖర్చు అయ్యాయో చెప్పాలని డిమాండ్ చేయడంతో ఆ శిలాఫలకాన్ని తొలగించి కొత్తగా రూ.20 లక్షల వ్యయం అయినట్లు మరో శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారన్నారు. తనకు అధికారం అప్పగిస్తే మేయర్‌గా అధికారం చేపట్టిన వెంటనే మహేందర్‌గౌడ్ పాల్పడ్డ కబ్జాలు, నిధుల దుర్వినియోగం అన్ని బయటకు తీస్తానన్నారు. ఇప్పటికే మహేందర్‌గౌడ్ అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. మహేందర్‌గౌడ్ పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్లకు మంగళవారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు.